
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

శనివారం 3 ఆగస్టు 2024

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	551.30 (212.6510)	4,61,797	31,464
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.15 (3.73)	453.93	514.00
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.96 (1.13)	277	నిల్

చికెన్ ధరలు: లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.230

అయిదేళ్లలో 35 లక్షల ఎకరాల

కొత్త ఆయకట్టు



జలకళ సంతరించుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్



కృష్ణమ్మకు వాయినం సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్, వెంకటరెడ్డి

- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మంత్రి కోమటిరెడ్డితో కలిసి నాగార్జునసాగర్ ఎడమ, వరద కాల్వకు నీటి విడుదల

రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 35లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టిస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రాజెక్టు ఎడమ కాల్వకు, వరదకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ రంగం ధ్వంసమైందన్నారు. రూ.1.80లక్షల కోట్ల అప్పులు చేసి కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ తదితర ప్రాజెక్టులు నిర్మిస్తే, కాళేశ్వరం కింద 95వేల ఎకరాల ఆయకట్టు చూపించినా ఆ ప్రాజెక్టు నాసిరకంగా కట్టడంతో కూలిపోయిందన్నారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టుల కింద ఒక్క ఎకరం కూడా కొత్త ఆయకట్టు రాలేదన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టి రాబోయే అయిదేళ్లలో స్పష్టమైన లక్ష్యంతో నూతన ఆయకట్టును సృష్టించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళుతోందన్నారు. సాగర్ ఎడమకాల్వపైనా, ఉమ్మడి జిల్లా ఇతర జలవనరుల ఆధారంగా నిర్మించిన పాత ఎత్తిపోతల పథకాలను పూర్తి సామర్థ్యంతో నడిచేందుకు, అదేవిధంగా నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కొత్తగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని లిఫ్టులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలుపుతాం: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలుపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పథకాన్ని 1983లో అప్పటి మంత్రి జానారెడ్డి మంజూరు చేయించారని, ఆ తర్వాత వైఎస్ఆర్ హయాంలో పథకాన్ని చేపట్టి తమ హయాంలోనే సొరంగమార్గంలో 90శాతం పూర్తయిందని, మిగిలిన పదిశాతం పనులను పదేళ్లలో పూర్తిచేయలేదని విమర్శించారు. మళ్లీ ప్రజాప్రభుత్వంలో తాము ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తిచేసి ఏఎమ్మార్పీ, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీటిని అందించి నల్లగొండ జిల్లాని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మంత్రులిద్దరూ కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే విషయమై చొరవ తీసుకోవాలని కోరగా మంత్రులు స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ గుర్తించి ఇచ్చే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్, సీఈ నాగేశ్వరరావు, కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈలు శ్రీనివాస్, పరమేష్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలం అయిందని, నీటిని ముందస్తుగానే విడుదల చేయడం తమకు భగవంతుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, రాబోయే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, గంధమల్ల రిజర్వాయర్, ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్ పనులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ) /నాగార్జునసాగర్

నాగార్జునసాగర్‌కు


జలకళ

- ఎగువనుంచి 4,61,797 క్యూసెక్కుల వరద
- మూడు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం

నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి 4.61లక్షల క్యూసెక్కుల వర ద వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రస్ట్ గేట్లను (నీటి మట్టం 546 అడుగులు) తాకిం ది.ఎగువనుంచి 4,89,361 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో 885అడుగుల(215.8070టీఎంసీలు) పూర్తిస్థాయి నీటిసామర్థ్యం గల శ్రీశైలం ప్రాజెక్టు కాగా శుక్రవారం సాయంత్రానికి 883.30అడుగులుగా (206.0996టీఎంసీ)నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టు 10క్రస్ట్ గేట్లను 20అడుగుల మేర ఎత్తి, కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తుండటంతో 4,61,797 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా ప్రస్తుతం 551.30 అడుగులుగా (212.6510 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 5,292 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 778 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 23,444 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,650 క్యూసెక్కులు మొత్తంగా సాగర్ నుంచి మొత్తం 31,464 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 4,61,797 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూడు రోజుల్లో సాగర్ గేట్లు ఎత్తే అవకాశం

సాగర్‌కు ఎగువ నుంచి ఇలాగే వరద రాక కొనసాగితే మరో మూడు రోజుల్లో క్రస్ట్ గేట్లను ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 551.30 అడుగులుగా ఉంది. మరో 39 అడుగులకు చేరుకుంటే సాగర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుంది. సాగర్‌కు రోజుకు ఎగువనుంచి 12 అడుగుల చొప్పున నీరు వచ్చి చేరుతుంది. కాబట్టి మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా ప్రస్తుతం 212.6510 టీఎంసీలుగా ఉంది మరో 100 టీఎంసీల నీరు సాగర్‌కు వచ్చి చేరితే పూర్తి సామర్థ్యానికి చేరుకుంటుంది.



ఎడమ కాల్వ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

వరదకాల్వకు నీటి విడుదల

పెద్దవూర: మండలంలోని పుల్యాతండా సమీపంలో పంప్‌హౌస్ నుంచి ఎస్ఎల్‌బీసీ లోలెవల్ కెనాల్(వరదకాల్వ)కు శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఒక మోటార్ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని వదిలారు.

నల్లగొండ జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన నాగార్జునసాగర్, నల్లగొండ, మిర్యాలగూడలలో 30 చెరువులు 45 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఈ కాల్వ సాగునీటిని అందిస్తుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 2 : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ నిర్వహించే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు స్వచ్ఛదనం - పచ్చదనంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయాలన్నారు. పారిశుధ్యం, గ్రీనరీ పెంచడమే లక్ష్యంగా గ్రామాల్లో, పట్టణాల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఆయా రోజుల్లో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, జడ్పీ సీఈవో అప్పారావు, డీఎంహెచ్‌వో కోటా చలం, డివిజనల్ పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, డీఈవో అశోక్, పీఆర్ ఈఈ మధవి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆరుతడికి ఊరట

- సాగులో నిమగ్నమైన రైతులు
- పత్తి, వరి పంటలకు ఊపిరిపోసిన వర్షం



సూర్యాపేట టౌన్, ఆగస్టు 2 : జిల్లాలో ఇటీవల కురిసిన ముసురు సాగుకు ఊపిరిపోసినట్లయింది. ముఖ్యంగా జూన్‌లో సాగు చేసిన పత్తి, మిరప, జొన్న, ఇతర పంటలు నీరు లేక వాడిపోతున్న సమయంలో ఇటీవలి వర్షాలు జీవం పోసినట్లయ్యింది. దీనికి తోడు వరి సాగుకు రైతులను సన్నద్ధులను చేసింది. ముఖ్యంగా నారుపోసి ఎదురుచూస్తున్న రైతులు నాట్లకు సిద్ధమయ్యారు. అడపాదడపా కురిసిన వర్షాలు అన్నిరకాల పంటలతో పాటు మెట్టపంటలకు, వరి సాగుకు అనుకూలంగా మారింది. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో వరి 1,00,974 ఎకరాల్లో సాగు చేయగా పత్తి 75,230 ఎకరాల్లో, కంది 955 ఎకరాల్లో, కూరగాయలు, ఇతర పంటలు 4,760 ఎకరాల్లో సాగు చేశారు.

సన్నరకాల సాగుకు రైతుల ఆసక్తి

ప్రస్తుత వానాకాల సీజన్‌లో సన్నరకాల సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగుపై ఆసక్తి పెరిగింది. అంతేకాకుండా దొడ్డురకం ధాన్యంతో పోల్చితే బహిరంగ మార్కెట్లలో సన్నరకం ధాన్యానికి అత్యధిక ధరలు పలుకుతున్నాయి. గతంలో సన్నరకం ధాన్యానికి మద్దతు ధరకు రూ.2,260 నుంచి రూ.2,600 వరకు ఉండగా ప్రభుత్వం ప్రోత్సాహకం కింద రూ.500 బోనస్ ఇస్తే రూ.2800 దాకా కొనుగోలు చేసే అవకాశం ఉంది. జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వానాకాలం సీజన్‌లో సన్నరకం ధాన్యాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు వెల్లడించారు. ప్రతీ ఏడాది ఈ సీజన్‌లో మొత్తం సుమారు 3 లక్షల నుంచి 4 లక్షల ఎకరాలకు పైగా సాగు చేస్తుండగా అందులో 2 నుంచి 3 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగుచేసే అవకాశం ఉన్నట్లు అంచనా. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మొత్తం రైతులు సన్నరకం ధాన్యాన్ని సాగు చేస్తుండగా, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని సరిసమానంగా సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని ఎస్సారెస్పీ కాల్వ నీళ్లను ఆధారంగా వరి సాగు చేసే రైతులలో ఎక్కువ మంది ఐఆర్-64, 1010 లాంటి దొడ్డురకం ధాన్యం సాగు చేస్తున్నారని తెలిపారు.

ఈ నియోజకవర్గంలో ప్రతీ వానాకాలం సీజన్‌లో సుమారుగా 2 లక్షలకు పైగా వరి సాగు చేస్తారు. అందులో లక్షన్నరకు పైగా దొడ్డురకం సాగు చేయగా మిగిలిన 50 వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

గత మూడేళ్లుగా..

జిల్లాలో 2022లో 96.1 మిల్లీమీటర్లు, జూలైలో 178.8, ఆగస్టులో 176.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా 2023 జూన్‌లో 60.5, జూలైలో 288.7, ఆగస్టులో 44.8 కాగా ఈ ఏడాది జూన్‌లో 146.5మిల్లీమీటర్లు, జూలైలో 155.4, ఆగస్టులో 7.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మొత్తంగా 2022లో 784మిల్లీమీటర్లు, 2023లో 714.1, కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 309.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలోనూ సన్నాల సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

జిల్లాలో కురిసిన వర్షం

జిల్లాలో శుక్రవారం వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చివ్వెంలలో 1.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మేళ్లచెర్వులో 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 0.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఆయిల్‌పాంతో ఆర్థిక అభివృద్ధి



ఆయిల్‌పాం క్షేత్రంలో మొక్కలు నాటుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

నేరేడుచర్ల, ఆగస్టు 2 : ఆయిల్‌పాం తోటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి టీ నాగయ్య తెలిపారు. మండలంలోని దాచారం గ్రామంలో గార్లపాటి గోవిందరెడ్డికి చెందిన 10 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తుండడంతో మొక్కలు నాటే కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. మొక్కలు నాటి మాట్లాడారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పాం తోటలను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఆయిల్‌పాం సాగు చేసిన నాలుగేళ్ల నుంచి దిగుబడి ప్రారంభం అవుతుందన్నారు. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతరపంటలకు రాయితీలు ఇస్తోందన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి రూ.4,200 చొప్పున మొదటి నాలుగేళ్లు ప్రోత్సాహకం ఇస్తారన్నారు. గరిష్ఠంగా ఒక రైతుకు 12.50 ఎకరాల వరకు డ్రిప్ రాయితీ పొందవచ్చన్నారు. మొదటి నాలుగేళ్లు అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యాన శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన శాఖాధికారి అనిత, మండల వ్యవసాయాధికారి జావిద్, ఏఈవోలు స్నేహగౌడ్, పతంజలి ఆయిల్‌పాం మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, సురేష్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

నడిగూడెం, ఆగస్టు 2 : ప్రభుత్వ భూమిని కాపాడాలని దళిత కుటుంబాలు అధికారులను డిమాండ్ చేశాయి. శుక్రవారం 30 దళిత కుటుంబాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సిరిపురంలోని సర్వేనంబర్ 311లో ఐదు ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారన్నారు. గ్రామానికి చెందిన మొక్క శ్రీను, వీరభద్రం, నర్సింహారావులు భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. గత తహసీల్దార్‌కు విన్నవించగా విచారణ చేసి ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసిన తిరిగి ఇటీవల భూమిని సాగు చేస్తున్నామన్నారు. ఆక్రమణలోని భూమిని దళితులకు పంచాలన్నారు. గతంలో ప్రభుత్వ భూమిగా అధికారులు బోర్డు ఏర్పాటు చేసినా ఆక్రమణదారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఈ విషయంలో దళితులకు న్యాయం చేయాలని తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు.

సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో దళితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్, జానమ్మ, తిరపయ్య, నరహరి, లక్ష్మి, పెద్దరాములు,నాగేశ్వరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తిమ్మాపురం జడ్పీహైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కోటా చలం

అర్వపల్లి, ఆగస్టు 2 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం అన్నారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. వాటితో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. వేడి నీరు చల్లార్చి తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, హెచ్‌ఎం నర్సయ్య, సూపర్‌వైజర్ లలిత, వాణి, దుర్గ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాలో మంత్రి ఉత్తమ్ రెండు రోజుల పర్యటన



హుజూర్‌నగర్, ఆగస్టు 2 : జిల్లాలో ఈ నెల 5, 6 తేదీల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన ఖరారైంది. ఈ నెల 5న కోదాడ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష చేయనున్నారు. అదేవిధంగా 6న హుజూర్‌నగర్ పట్టణంలోని హౌసింగ్ మోడల్ కాలనీ, క్రిస్టియన్ శ్మశానవాటిక, టౌన్‌హాల్ నిర్మాణ పనులు, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్‌పీ క్యాంప్, మినీస్టేడియం, గవర్నమెంట్ ఆసుపత్రి పనులను పరిశీలిస్తారు. అనంతరం అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం : ఆర్డీవో



జాన్‌పహాడ్ ఎత్తిపోతల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

పాలకవీడు, ఆగస్టు 2 : రాష్ట్ర ప్రభుత్వం రూ.173 కోట్లతో నిర్మించనున్న జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకం ద్వారా భూమి కోల్పోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందిస్తామని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ వద్ద ఎత్తిపోతల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ ఎత్తిపోతల నిర్మాణంతో 5.20ఎకరాల భూమిని కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, డీటీ కమలాకర్, మలమంటి దర్గారావు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లివాసుడి కల్యాణం



మఠంపల్లి, ఆగస్టు 2 : మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి శుక్రవారం విశేషఅర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం ఆరెపత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. మధ్యాహ్నం రాజ్యలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని టిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. తిరుమలగిరి పరిధి అనంతారం సమీపంలోని టిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గొడిశాల సోమన్న, రెడ్డిమల్ల ప్రభాకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి

కట్టంగూరు, ఆగస్టు 2: అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం సోనాముఖి జిల్లా బంకురా గ్రామానికి చెందిన దీబాస్ బౌరి(19) అనే వలస కార్మికుడు గత కొంత కాలం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి స్థానిక శ్రీ రాఘవేంద్ర ఫెర్రోఅలయస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కడుపునొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నొప్పి తగ్గకపోవడంతో శుక్రవారం నల్లగొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రి జిల్లాలో 'వైఫ్‌స్వాపింగ్' కలకలం

భువనగిరి టౌన్, ఆగస్టు 2 : భార్యలను పరస్పర అంగీకారంతో ఇతరులతో పంచుకోవడం(వైఫ్‌స్వాపింగ్) యాదాద్రిభువనగిరి జిల్లాలో చర్చనీయాంశమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు జంటలు జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణ శివారులో అద్దె ఇళ్లలో ఉండేవారు. ఈ జంటలు పరస్పర అంగీకారంతో భార్యలను(వైఫ్ స్వాపింగ్) మార్చుకునేవారు. ఈ జంటలు తమ ఇళ్లకు సమీపంలో ఉత్తర భారతదేశ ప్రాంతానికి చెందిన ఓ కార్మికుడి కుటుంబాన్ని పరిచయం చేసుకుని తమ రొంపిలోకి లాగాయి. పరిస్థితులకు అనుగుణంగా ఆ మూడు ఇళ్లలోనే పగలురాత్రీ తేడా లేకుండా వైఫ్ స్వాపింగ్‌కు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో మూడు జంటల్లో ఓ వ్యక్తి తన భార్య చెల్లెలిని ఇందులోకి లాగాలని అందరినీ ఒప్పించాడు. అయితే ఆ కుట్ర తెలియని ఆమె ఇటీవల అక్క ఇంటికి వచ్చింది. అక్కాచెల్లెలు కలిసి కలిసి మరో జంట ఇంటికి వెళ్లారు. అయితే ఆ చెల్లెలు గతంలో మెడికల్ షాప్‌లో పనిచేసిన అనుభవంతో ఆ ఇంటిలో కనిపించిన మందులను ఎవరు వాడుతున్నారని ప్రశ్నించింది. దీంతో మేం వాడుతున్నామని ఆ ఇంటి ఇల్లాలు చెప్పింది. అనంతరం ఇంటికి వెళ్లాక ఆ జంట వాడుతున్నది సుఖవ్యాధులకు సంబంధించిన మందులుగా, నిర్లక్ష్యం చేస్తే హెచ్ఐవీగా రూపాంతరం చెందుతుందని, జాగ్రత్తగా ఉండాలని అక్కను హెచ్చరించి చెల్లెలు అదే రోజు ఊరికి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రెండు జంటలు అద్దె ఇళ్లను ఖాళీ చేసి భువనగిరి విడిచివెళ్లాయి. మరో జంట కూడా త్వరలోనే సొంత ప్రదేశానికి వెళ్లి వైద్య చికిత్సలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నాం

బస్సులు ఆపాలని విద్యార్థుల ధర్నా ● గంటపాటు నిలిచిన వాహనాలు



మోటకొండూరు మండలం కాటేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

మోటకొండూరు, ఆగస్టు 2: ఆర్టీసీ బస్సులు ఆపకపోవటంతో సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు రాస్తారోకో చేశారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. రాయగిరి-మోత్కూరు ప్రధానరహదారి వెంట ఉన్న కాటేపల్లి గ్రామానికి చెందిన 30మంది విద్యార్థులు భువనగిరిలో ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. కళాశాలలు ప్రారంభమై రెండునెలలుగా భువనగిరి వైపు వెళ్లే బస్సులు ఆపడంలేదని నిరసన వ్యక్తంచేస్తూ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సమయానుకూలంగా రెండు బస్సులు నడపడంతో పాటు, అన్ని బస్సులను కాటేపల్లి స్టేజీ వద్ద ఆపాలని డిమాండ్ చేశారు. గంటపాటు ధర్నాతో రెండువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్‌ను పోలీసులు ఫోన్‌లో సంప్రదించగా వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, విద్యార్థులు జువ్వగాని శ్రీరామ్, ఎండీ.అన్వర్, మల్లెల శ్రీహరి, సాయికుమార్, వరికుప్పల ఉమారాణి, వర్ష, సౌజన్య పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య

● అప్పు తీర్చలేక ఒంటరి మహిళ హత్య
● ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పరార్



జానకమ్మ(ఫైల్)

నార్కట్‌పల్లి, ఆగస్టు 2: తల్లి చేసిన అప్పు తీర్చలేక ఓ కుమారుడు ఒంటరి మహిళను కడతేర్చి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్, గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణవెల్లెంలకు చెందిన రెబ్బ జానకమ్మ(72)కు చౌటుప్పల్‌కు చెందిన సత్తయ్యతో వివాహం కాగా, వారికి సంతానం లేదు. దీంతో సత్తయ్య రెండో వివాహం చేసుకుని చౌటుప్పల్‌లో ఉంటున్నాడు. ఇద్దరి మధ్య వివాదాల నేపథ్యంలో జానకమ్మ 33ఏళ్ల క్రితమే బ్రాహ్మణవెల్లెంలకు వచ్చి తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త సత్తయ్య ఐదేళ్ల క్రితం మృతిచెందగా, మూడేళ్ల క్రితం తల్లి మృతిచెందటంతో ఒంటరిగానే ఉంటోంది. జీవనోపాధి కోసం గ్రామంలో మగ్గాల వద్ద రంగులు అద్దే పనికి వెళుతూ ఉండేది. బ్రాహ్మణవెల్లెంలలో ప్రస్తుతం నివసిస్తున్న ఇంటినే కొనుగోలు చేసింది. తన కష్టంతో సంపాదించి దాచుకున్న డబ్బులను వడ్డీలకు ఇచ్చేది. ఇందులో భాగంగానే సుమారు లక్ష రూపాయలు ఇదే గ్రామానికి చెందిన కొలను రంగనాయకమ్మకు అప్పుగా ఇచ్చింది. రంగనాయకమ్మ కుమారుడు కార్తీక్ గ్రామంలోని మునుగోడు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు వద్ద కొన్నాళ్లపాటు హోటల్ నిర్వహించి ప్రస్తుతం సొంతంగా మగ్గం నడుపుతున్నాడు. తీసుకున్న అప్పు త్వరగా చెల్లించాలని జానకమ్మ రంగనాయకమ్మను తరచూ అడుగుతోంది.

హత్యచేసి ఆభరణాలతో పరార్..

ప్రతీ రోజూ ఉదయాన్నే నిద్ర లేచే జానకమ్మ 7 గంటలు దాటినా లేవకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న చెరుపల్లి అండాలు, జయసింహ వచ్చి తలుపుతట్టారు. ఆమె పిలిచినా పలకకపోవడంతో వేరే గుమ్మం వద్దకు వెళ్లగా ఆ సమయంలో రంగనాయకమ్మ కుమారుడు కొలను కార్తీక్ జానకమ్మ ఇంటి లోపలి నుంచి బయటకు వచ్చాడు. నువ్వెందుకు జానకమ్మ ఇంట్లోకి వచ్చావు.. జానకమ్మ ఏదని అడుగుతుండగానే ఆమె ఇంట్లో నిద్రిస్తోందని చెప్పి ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. వారు ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి జానకమ్మ విగతజీవిగా పడిఉంది. అప్పు తీర్చాల్సివస్తుందని ఆమెను హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను కూడా కార్తీక్ తీసుకుని పరారైనట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐలు నాగరాజు, క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యక్ష సాక్షులను విచారించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతురాలు జానకమ్మ సవతి కుమారుడు రెబ్బ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. నిందితుడిగా అనుమానిస్తున్న కార్తీక్ దిగా భావిస్తున్న హెల్మెట్‌ను పోలీసులు జానకమ్మ ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కార్తీక్ ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామన్నారు.

తండ్రి మరొకరితో సహజీవనం చేస్తున్నాడని..



కొండయ్య(ఫైల్)

గుర్రంపోడు, ఆగస్టు 2: తండ్రి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆగ్రహించిన కుమారుడు రోకలిబండతో విచక్షణా రహితంగా కొట్టడంతో మృతిచెందాడు. గురువారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చేపూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శివప్రసాద్, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం చేపూరు గ్రామానికి చెందిన అయితగోని కొండయ్య (62) వ్యవసాయ పనులతో పాటు సీజన్‌లో కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొండయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శంకర్‌కు వివాహంకాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రితోపాటే వ్యవసాయం చేసుకుంటూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొండయ్య భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో మహిళతో కొద్ది కాలంగా సహజీవనం చేస్తున్నాడు. గురువారం ఆ మహిళకు సంబంధించిన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కొండయ్యతో కుమారుడు అయితగోని శంకర్ గొడవపడ్డాడు. మహిళతో సహజీవనం చేస్తున్నావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. దీంతో కొండయ్య సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి వెళ్లి భోజనం చేసి అక్కడే నిద్రించాడు. శంకర్ ఆగ్రహంతో ఆమె ఇంటికి వెళ్లి తండ్రితో గొడవపడి అక్కడున్న రోకలిబండతో విచక్షణారహితంగా కొట్టి పరారయ్యాడు. తీవ్రగాయాలైన కొండయ్యను చుట్టుపక్కల వారు 108లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొండయ్య పెద్ద కుమార్తె పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నర్సయ్య(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 2 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సయ్యగూడెం వద్ద కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లెపు నర్సయ్య(60) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం వలిగొండ మండలకేంద్రానికి మోపెడ్‌పై వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. నర్సయ్యగూడెం స్టేజీ దాటాక ఎదురుగా అజాగ్రత్తగా వచ్చిన కారు నర్సయ్య మోపెడ్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సయ్య కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చండూరులో ఆటో బోల్తాపడి బాలుడు..



అనిల్(ఫైల్)

చండూరు, ఆగస్టు 2 : కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో బాలుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 12మంది కూలీలు బత్తాయిలు ఏరడానికి గుర్రంపోడు మండలం చామలోనిబావి గ్రామానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా చండూరు మునిసిపల్ కేంద్రంలో ఆటో బోల్తా పడింది. అయితే ఆటోలో నేరళ్లపల్లి గ్రామానికి చెందిన కడారి శ్రీను, నాగమ్మ దంపతులతో పాటు కుమారుడు అనిల్(15)లో ప్రయాణిస్తున్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ పక్కనే కూర్చున్న కడారి అనిల్(15) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌తో పాటు మరో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా నలుగురిని అంబులెన్స్‌లో నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని స్థానిక ఆసుపత్రిలో తరలించి చికిత్స అందించారు. మరికొంత మందికి స్వల్పగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడం, వారికి కూడా తీవ్రగాయాలుకావడంతో వారు స్పృహతప్పిపోయారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు. మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు(42) సొంతపని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. పని ముగించుకొని ఇంటికివెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోదాడ - జడ్చర్ల రహదారిపై కారు అదుపుతప్పి ఢీకొట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సైదులను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండజిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ సైదులు శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. సైదులు సోదరుడు సోమయ్య ఫిర్యాదుమేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వీరాంజనేయులుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

సహాయక చర్యల్లో పాల్గొని.. తీవ్ర గాయాలపాలై...

● తాటిచెట్టుపై వృద్ధ గీత కార్మికుడి ఆత్మహత్య
● దింపే క్రమంలో ఓ వ్యక్తిపై పడిన మృతదేహం
● తీవ్రగాయాలతో వ్యక్తి ఆసుపత్రిపాలు

మునగాల, ఆగస్టు 2: సహాయకచర్యల్లో పాల్గొన్న ఓ వ్యక్తి 20అడుగుల ఎత్తునుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దేశగాని వెంకటేశం(70) కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్యకు మతిస్థిమితం లేదు. వీరికి సంతానం లేకపోవడంతో మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలయ్యారు. కొద్దిరోజులు మానసిక ఒత్తిడితో ఉన్న వెంకటేశం శుక్రవారం మోకు ముస్తాద్‌తో తాటిచెట్టు ఎక్కి చెట్టు పైభాగాన బలమైన మట్టకు టవల్‌తో మెడకు కట్టుకుని మోకు ముస్తాద్‌లను కిందికి వదలడంతో మృతి చెందాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి బంధువులకు సమాచారం అందించడంతో వెంకటేశం మృతదేహాన్ని కిందికి దింపేందుకు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కీర్తి నర్సయ్య చెట్టు పైకి ఎక్కగా, మరో వ్యక్తి జూలూరి నాగరాజు చెట్టు సగం దూరం ఎక్కి ఉన్నాడు. ఈ క్రమంలో మృతదేహానికి ఉన్న తాడు తెగి మృతదేహం చెట్టు మధ్యలో ఉన్న నాగరాజు మీద పడింది. దీంతో 20 అడుగుల ఎత్తునుంచి నాగరాజు, మృతదేహం కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన నాగరాజును కోదాడ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. వెంకటేశం బంధువు దేశగాని నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చెట్టు సగం వరకు ఎక్కిన జూలూరి నాగరాజుపై పడుతున్న వెంకటేశం మృతదేహం

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి..

తిరుమలగిరి, ఆగస్టు 2 : క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన గిరిబాబు మునిసిపల్ కేంద్రంలోని సుప్రజ ఎస్టేట్‌లో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రియుడి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఘటన




అనిత(ఫైల్)

నకిరేకల్, ఆగస్టు 2: ప్రియుని వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన అనిత(28)కు నోముల గ్రామానికి చెందిన వెల్మకంటి శ్రీనుతో పదేళ్ల క్రితం వివాహంకాగా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనిత కిరాణ దుకాణంతో పాటు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అదే గ్రామానికి చెందిన టేకుల రాజేష్‌తో సాన్నిహిత్యంగా ఉండటంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం గ్రామస్థులు ఇరువురిని మందలించి నచ్చజెప్పారు. కొద్దిరోజులుగా అనితకు రాజేష్ ఫోన్ చేసి వేధించడం మొదలు పెట్టాడు. మళ్లీ తన దగ్గరికి రావాలని తరచూ ఫోన్ చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కొందరు పెద్ద మనుషులు రాజేష్‌ను మందలించారు. అయినా వినకుండా గురువారం రాత్రి మళ్లీ అనితకు ఫోన్ చేశాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషుల వద్దకు రావాలని వేధించడంతో మనస్తాపానికి గురైంది. అనిత ఇంట్లో తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని రాజేష్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగటంతో ఎస్ఐ గోపికృష్ణ హుటాహుటిన వెళ్లి ఎలాంటి ఘర్షణ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేష్ లేకపోవడంతో మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాత్రి 10 గంటల వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఈ విషయంపై సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆయన తెలిపారు.

ఆండాళ్ అమ్మవారికి వైభవంగా ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, ఆగస్టు 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వయంభూలను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారిని అలకరించి సేవలో తీర్చిదిద్దారు. అనంతరం మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీయాగం చేపట్టారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.10,24,087 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మాజీ ఉపప్రధానార్చకుడికి ఘనసన్మానం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉపప్రధానార్చకుడిగా ఉద్యోగ విరమణ పొందిన పీ భాస్కరాచార్యులు దంపతులను ఘనంగా సన్మానించారు. ధన్వంతరి వేదికపై జరిగిన కార్యక్రమంలో వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మాధవశేషస్వామి, కాటూరి శ్రీనుస్వామి, రామసీత, గట్టు నరసింహాచార్యులు, కేశవచార్యులు, అపోలో వెంకటాచార్యులు, మోటపల్లి గిరిస్వామి, రామాంజనేయచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో పెట్టి.. ఆభరణం కొట్టేసి..

సీసీ టీవీలో చూసి వెంటబడిన జ్యువెల్లరీ షాప్ యజమాని

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : ఆటోలో వచ్చిన ఓ మహిళ బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి చోరీకి యత్నించింది. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బురఖా ధరించిన మహిళ భవాని జ్యువెలరీ షాపులోకి వెళ్లింది. ఆభరణాలు పరిశీలిస్తూ సేల్స్ ప్రమోటర్లను మాటల్లో పెట్టి బేరం ఆడింది. అప్పటికే దుకాణంలో వినియోగదారుల రద్దీ అధికంగా ఉండడంతో సేల్స్‌ప్రమోటర్లు బిజీగా ఉండడాన్ని గమనించిన మహిళ రెండు బంగారు ఆభరణాలను తస్కరించి ఆటోలో పారిపోయేందుకు ప్రయత్నించింది. మహిళ చోరీకి పాల్పడుతుండగా రికార్డైన సీసీ టీవీఫుటేజీని షాపు యాజమాని గుర్తించి కేకపెట్టాడు. దీంతో స్థానికులు ఆటోను అటకాయించారు. దీన్ని గమనించిన ఆటోడ్రైవర్ పారిపోగా, సదరు మహిళ స్థానికులకు చిక్కింది. అనంతరం జ్యువెలరీ షాపులోకి తీసుకెళ్లి ఆమెను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యం కావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. నిందితురాలిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు మహిళ పట్టణంలోని సీతారాంపురం కాలనీ వాసిగా స్థానికులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నేరేడుచర్లలో పట్టపగలు చోరీ

నేరేడుచర్ల, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని పట్టపగలు చోరీజరిగింది. విద్యానగర్‌కు చెందిన రావిరాల భ్రమరాంబ శుక్రవారం మధ్యాహ్నం టాబ్లెట్లు తెచ్చుకునేందుకు ఇంటికి తాళం వేసి మిర్యాలగూడకు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 36 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. డయల్-100 ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపింది.

దొంగల గుర్తింపు

కోదాడ రూరల్, ఆగస్టు 2 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామంలోని చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు గుర్తించారు. వారికి సంబంధించిన ఫొటోలను రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ఆర్ కాలనీలో 45 రోజుల వ్యవధిలో ఐదు చోరీల్లో విలువైన వస్తువులు, డబ్బు, బంగారం అపహరణకు గురయ్యాయి. కాలనీవాసులు ఫిర్యాదుతో విచారించిన పోలీసులు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను సీసీ కెమెరాలో గుర్తించామని, వారి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా వారి ఫొటోలను సేకరించి విడుదల చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఇరువురు వ్యక్తులు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలు చేస్తున్నారని, ఎవరైనా వీరిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి కోరారు.



పోలీసులు విడుదల చేసిన దొంగల చిత్రాలు

ఇరవై అడుగుల కొండచిలువ

అర్వపల్లి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో చెరువులో ఊతతో చేపలు పడుతున్న వ్యక్తికి 20 అడుగుల కొండచిలువ లభించింది. శుక్రవారం గ్రామానికి చెందిన సైదులు ఊతతో చేపలు పడుతున్నాడు. ఒక్కసారిగా 20 అడుగుల కొండచిలువ ఊతలోకి పడడంతో సైదులు ఉలిక్కిపడ్డాడు. కొండచిలువను గట్టిగా పట్టుకొని గ్రామస్తులు బయటికి తీశారు. అప్పటికే ఊపిరాడక కొండచిలువ మృతి చెందింది. కొండచిలువను చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపారు.



చెరువులో ఊతకు చిక్కిన కొండచిలువ



వరదకాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరద కాల్వలో చెట్లను తొలగించాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 2: వరదకాల్వలో చెట్లను తొలగించి వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను పరిశీలించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత వేసవికాలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను తొలగించి ఉంటే ప్రస్తుతం సాగర్ నుంచి వరదకాల్వలోకి నీరు త్వరగా చేరి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేదన్నారు. వరదకాల్వ కింద రైతులు పెద్దఎత్తున నారుమడులు పోసుకున్నారని, వెంటనే అధికారులు స్పందించి చెట్లను తొలగించి నీరు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి మల్లారెడ్డి, శ్రీను, శ్రీకర్, సీతారాంరెడ్డి, చంద్రయ్య, భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, నాగయ్య, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

30ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం

● టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ ● జిల్లాలో రెండో రోజూ కొనసాగిన సంబురాలు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 2: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైనదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 30ఏళ్ల పాటు చేసిన పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. అమరవీరులకు న్యాయం చేసేలా ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌మాదిగ, బొడ్డు మల్సూర్, పిడమర్తి మధు, ఎడవెల్లి రాము, బొల్లె అశోక్, సూరారపు నాగయ్య పాల్గొన్నారు.



నూతనకల్‌లో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులకు అంకితమని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్, బీసీ, ఎస్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణమాదిగా ఆధ్వర్యంలో ఎన్నో వీరోచిత పోరాటాలు చేశామన్నారు. సుప్రీంకోర్టు కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామనిన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణను తెలంగాణలో మొదటగా అమలుచేస్తామని ప్రకటించిందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, దళిత ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీను, గుగులోతు శ్రీను, వేముల వెంకన్న, పోతరాజు సురేష్, పడిశాల ప్రశాంత్, పానుగంటి గణేష్, బాబు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ పట్టణంలో వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాదిగ జర్నలిస్టు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ జర్నలిస్టుల కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పిడమర్తి గాంధీ, జిల్లా నాయకుడు పడిశాల రఘు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాడిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీమ శేఖర్, బుచ్చిరాములు, ఏపూరి సునీల్, ఏపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: మంద కృష్ణమాదిగ సారథ్యంలో 30ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో కదలిక వచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి బాలయ్య అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంపాక సత్తయ్య, కొమ్ము అంజయ్య, పరశురాములు, బరపటి ఉపేందర్, వీరన్న, పాల్వాయి సత్తయ్య, కొమ్ము వెంకన్న పాల్గొన్నారు.

నూతన్‌కల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పాల్వాయి పరశురాములు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఎర్రపహాడ్ గ్రామంలో బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి మధుగంగాధర్, లక్ష్మీకాంత్, గోపీ, దంతాల వెంకటయ్య పాల్గొన్నారు.



సూర్యాపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు మంద భిక్షం, దేవపంగు ఆరోన్ అన్నారు. పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఏడు మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో చంద్రయ్య, రాకేష్, విశాఖ, సందీప్, శ్రీకాంత్, మట్టపల్లి, ప్రశాంత్, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని నాగులపాటిఅన్నారం గ్రామంలో దళిత నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల లచ్చయ్య, పొడపంగి ప్రసాద్, నకిరేకంటి దేవయ్య, సైదులు, వెంకన్న, రవి, బుజ్జయ్య, ప్రభాకర్, మామిడి శేఖర్, నకిరేకంటి రాంబాబు, డీలర్ వెంకన్న, నాగరాజు, మధు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో అభివాదం చేస్తున్న కందుకూరి సోమన్న తదితరులు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు



కోదాడలో మిఠాయి తినిపిస్తున్న మాదిగ జర్నలిస్టు నాయకులు

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

తిరుమలగిరి, నూతనకల్, ఆగస్టు 2: పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం మాజీ సర్పంచులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా తిరుమలగిరి మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో కరుణాకర్, వీరయ్య, రవీందర్, దేవా, రవి ఉన్నారు.

● సచివాలయం ఎదుట నిర్వహించే దీక్షకు వెళ్లకుండా శుక్రవారం తెల్లవారుజామున బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను నూతనకల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చూడి లింగారెడ్డి, కొచ్చెర్ల బాబు, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులను..

తుంగతుర్తి, ఆగస్టు 2: అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. 'దళిత బంధు' లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో బీఆర్ఎస్ నాయకులు తడకమళ్ల రవికుమార్, కొండగడుపుల వెంకటేష్, మల్లికార్జున్, చింతకుంట్ల సురేష్ ఉన్నారు.

మఠంపల్లి: అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టుకు నిరసనగా చలో అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బీఆర్ఎస్ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో బారెడ్డి సీతారాంరెడ్డి, టీక్యానాయక్, లక్ష్మీనరసింహరాజుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

చౌటపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించాలి

మఠంపల్లి, ఆగస్టు 2: మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాదులో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించారు. చౌటపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ సింహ ద్వారం ఏర్పాటు చేయాలని, నిరుపేదలకు ఇళ్ల, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. వీటికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ సింగారపు సైదులు, ఆలయ ఈవో లక్ష్మణరావు, నాయకులు కొండేటి రాంరెడ్డి, హుస్సేన్ రెడ్డి, ఎం.లింగయ్య, వీరాంరెడ్డి వీరారెడ్డి, కె.నాగార్జునరెడ్డి ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 2: యువత మత్తుపదార్థాలకు, గంజాయికి బానిస కావొద్దని జనసమితి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్‌గౌడ్ అన్నారు. గంజాయి నిర్మూలనకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట అవగాహన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి నిర్మూలించాలంటూ ఈనెల 6వ తేదీ నుంచి 100రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శీలం గౌతం, వంశీ, రాజేష్, ప్రభాస్, ఉప్పిరాజు, మహేష్, ఉమేష్, నవీన్, సంతోష్‌పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ పరమేష్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృషి పాఠశాల విద్యార్థులు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తుమ్మ సతీష్, రాము, రమేష్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. చింతలపాలెంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ సైదిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం..పచ్చదనం' విజయవంతం చేయాలి

సూర్యాపేట టౌన్, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, డీఈ సత్యారావు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

మఠంపల్లి, నూతనకల్, అర్వపల్లి, పెన్‌పహాడ్, ఆగస్టు 2: మఠంపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా హరిసింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హరిసింగ్ ఇప్పటివరకు మోతె మండలంలో పనిచేశారు. మఠంపల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఆంజనేయులు మోతె మండలానికి బదిలీ అయ్యారు.

● నూతన్‌కల్ ఎస్‌ఐగా మహేంద్రనాథ్ బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట రెండో పట్టణ ఎస్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై నూతనకల్‌కు వచ్చారు. నూతనకల్ ఎస్‌ఐ సైదులును వీఆర్‌లో ఉంచారు.

● అర్వపల్లి ఎస్‌ఐగా బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. బాలకృష్ణ సూర్యాపేట టూ టౌన్ నుంచి బదిలీపై అర్వపల్లికి వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన ఎస్‌ఐ యాకుబ్‌ను వీఆర్‌లో ఉంచారు.

● పెన్‌పహాడ్ మండల తహసీల్దార్‌గా పదోన్నతిపై డిప్యూటీ తహసీల్దార్ ధరావత్ లాలు బాధ్యతలు స్వీకరించారు. పెన్‌పహాడ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మహేందర్‌రెడ్డి యాదాద్రిభువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు.

చిన్నారి వైద్యానికి చేయూత

మేళ్లచెర్వు, ఆగస్టు 2: మండల కేంద్రానికి చెందిన పత్తి మాధవి పుల్లయ్య కుమారుడు ఈశ్వరప్రసాద్ తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా మండల కేంద్రానికి చెందిన ఐడియల్ హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణకుమార్, రాజశేఖర్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు చేయూత

సూర్యాపేట రూరల్, ఆగస్టు 2: మండలంలోని కాసరబాద రోడ్డులోని అపూర్వ బధిరుల పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయ్ ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో రూ.4లక్షల విలువైన ఇయరింగ్ హెడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మదనాచారి, అబ్దుల్ రహీం, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు సాయిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం



రామచంద్రం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఆగస్టు 2: బీఆర్ఎస్ కారకర్తల కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో మేకపోతుల రామచంద్రంగౌడ్, అనంతారం గ్రామంలో స్వాతంత్ర్య సమర యోధుడు, రిటైర్డు ఉపాధ్యాయుడు బైరెడ్డి మట్టారెడ్డి, నాగులపహాడ్ గ్రామంలో సంకరమద్ది నారాయణమ్మ, సంకరమద్ది మణెమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన నారాయణగూడెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు నారాయణ రాఘవరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, దొంగరి యుగేందర్, జానకిరాంరెడ్డి, సీతారాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

అర్చకుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మఠంపల్లి, ఆగస్టు 2: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అర్చకుడు, మట్టపల్లి గ్రామవాసి పి.లక్ష్మీనరసింహమూర్తి(63) గురువారం మృతి చెందారు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సైదిరెడ్డి వెంట నాయకులు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, వెంకటశివ ఉన్నారు.

చింతలపాలెం ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేళ్లచెర్వు, ఆగస్టు 2: చింతలపాలెం ఎంపీడీవో డి.పవన్‌కుమార్‌పై మండల ఉద్యోగులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో వేధిస్తున్నారని, సిబ్బందిని చిన్న చూపు చూస్తూ మాటలతో మానసికంగా వేధిస్తున్నారని, గ్రామాల సందర్శనకు వచ్చినప్పుడు చిన్న చిన్న విషయాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం, బెదిరించడం, బ్లాక్ మెయిల్ చేయడం, డబ్బులు ఇవ్వాలని వేధించడం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినవారిలో మండలానికి చెందిన 16మంది పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ ఉద్యోగులు ఉన్నారు. ఎంపీడీవో పై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా సెలవులపై వెళ్తామని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈకేపేట తండా పంచాయతీగా గెజిట్

నడిగూడెం, ఆగస్టు 2: మండలంలోని ఈకేపేట తండాను గ్రామ పంచాయతీగా చేస్తూ అధికారులు శుక్రవారం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఈకేపేట పరిధిలో ఉన్న ఈ తండాకు ప్రత్యేక పంచాయతీ కానుంది.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



హుజూర్‌నగర్, ఆగస్టు 2: హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంకు చెందిన కన్నెగంటి భార్గవ చారి జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. బెంగుళూరులోఈ నెల 4, 5 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో భార్గవచారి పాల్గొననున్నాడు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, తుంగతుర్తి ఆగస్టు 2: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, ఎర్ర అఖిల్ కుమార్, గొడ్డలి నర్సయ్య, సయ్యద్, వాజిద్, పిడమర్తి లింగయ్య, భూక్య రాంజీ, సూరం రేణుక, జయమ్మ, హుస్సేన్,పాల్గొన్నారు.

● ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటిని వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తుంగతుర్తిలో తహసీల్దార్ కంటమయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేల్పుల పరశురాం, వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు.తుంగతుర్తిలో నిర్వహించిన ఏఐటీయూసీ చేరిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరుణకుమారి, సీహెచ్ సీతామహాలక్ష్మి, గుగులోతు రాజారాం, శ్యాంసుందర్, కోట రామస్వామి, స్వప్న, సుమిత్రాదేవి, మంజుల, హరిత, సరస్వతి, భాగ్యమ్మ, మల్లమ్మ, శోభ, రాణి, చంద్రకళ, ఉష, విమల పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు దివ్యౌషధం

గరిడేపల్లి, చిలుకూరు, మఠంపల్లి, మేళ్లచెర్వు, హుజూర్‌నగర్, ఆగస్టు 2: తల్లి పాలే చంటి బిడ్డలకు దివ్యౌషధమని అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం మండలంలోని కీతవారిగూడెం, గడ్డిపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి, హెచ్ఎం ఉమ, అంగన్ వాడీ టీచర్లు, నారాయ ణమ్మ, బషీర, సునీత, సాయమ్మ, సైదమ్మ, ఏఎన్ఎం శకుంతల, రాజకుమారి, , గర్భిణులు పాల్గొన్నారు.

● చిలుకూరు మండలంలోని తమ్మారబండపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాలను బిడ్డకు పట్టిస్తే లాభాలను గర్భిణులు, బాలింతలకు సెక్టార్ సూపర్‌వైజర్ డి.రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం రజియా పాల్గొన్నారు.

● తల్లిపాలే బిడ్డకు అమృతమని మండల వైద్యాధికారి సుధాకర్ నాయక్ అన్నారు. మఠంపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● తల్లి పాలతోనే పిల్లలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మేళ్లచెర్వు మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్ అన్నారు.



గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మేళ్లచెర్వులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కుమారి, వినోద, రాజ్‌కుమార్, వినోద్‌కుమార్, ఏఎన్ఎంలు, ప్రియాంక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి వనజ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 13వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తాళ్లూరి మాలతి, లలిత, ఆకుల రజని, మీసాల నాగమణి, రేణుక, డాక్టర్ సింధు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: విపక్షాలు సహకరిస్తే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న దివంగత ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి(కేబీఆర్) పార్కు పేరును, కేబీఆర్ విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

పెన్‌పహాడ్:మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కేశగాని లక్ష్మణ్‌గౌడ్(62) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య (మాజీ ఎంపీటీసీ మంగమ్మ), ఇద్దరు కుమారులు నాగేంద్రబాబు, నరేందర్‌బాబు ఉన్నారు. లక్ష్మణ్‌గౌడ్ మృతికి భుజంగరావు, సురేష్‌రావు, కేశవులు, శ్రీరాములుగౌడ్ తదితరులు సంతాపం తెలిపారు.

చివ్వెంల: కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రేగటి లింగయ్య, మండవ వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, ఖమ్మంపాటి రాము, బూర వెంకటేశ్వర్లు, అంతయ్య, నిమ్మల ప్రభాకర్, లింగయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డవేణుగోపాలస్వామి దేవాలయంలో గోపూజ నిర్వహించారు. శ్రీగోదావేణుగోపాల భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, వెంకన్న, రాములు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామంలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 60 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షురాలు కొత్తా కళావతి, మాధవి, భారతమ్మ, లక్ష్మి, పద్మావతి, విజయ, సోమలక్ష్మి, ఇందిర, పెద్దారపు భవాని, గోపిరెడ్డి, వీరారెడ్డి, గిరిజకుమారి పాల్గొన్నారు.

మఠంపల్లి: తండాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. మండలంలోని తుమ్మలతండాలో అంతర్గత రోడ్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. తండాలో ఉన్న లింక్ రోడ్డును 33అడుగులకు విస్తరించాలని తండావాసులు కోరగా, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణానాయక్, భాస్కర్‌నాయక్, తులసీరాంనాయక్, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, కోటేష్‌నాయక్, శివాజీనాయక్, నగేష్‌నాయక్ పాల్గొన్నారు.

● నూతనంగా పట్టాదారు పుస్తకం పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మఠంపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు కోరారు. ఏవో కార్యాలయంలో రైతుల నుంచి బీమా దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు.కార్యక్రమంలో భవన్, ఝాన్సీ పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు భూక్య సైదులునాయక్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, పలువురు నాయకులు నివాళులర్పించారు.

గరిడేపల్లి:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందించాలని జిల్లా సహకార సంఘాల అధికారి పద్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాయినిగూడెం పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏ సీఎస్‌ల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమెను పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ పీఏసీఎస్ కారదర్శి సన్మానించారు.

● కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వక్కంతుల నర్సమ్మ ఆశయాలను సాధించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ మేకల నాగేశ్వరరావు అన్నారు. గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో నర్సమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి నర్సమ్మ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెనగాని సాంబయ్య, కందుల వెంకటేశ్వర్లు, ఎలుగూరి నర్సింహారావు, రాజు, తిరపయ్య, రఘు, అంజయ్య, అర్జున్‌రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కోదాడ టౌన్: ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కోదాడలో నిర్మిస్తున్న 100అడుగుల జాతీయ జెండా నిర్మాణానికి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణ రూ.5వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన నిర్వహించే జెండా ఆవిష్కరణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండా మధుసూదన్, కొండపల్లి వాసు, జగిని ప్రసాద్ పాల్గొన్నారు.

● గీత కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. కోదాడలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో 100మంది గీత కార్మికులకు ఈ నెల ఐదో తేదీ నుంచి ప్రభుత్వం మోకులను పంపిణీ చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని రామలక్ష్మీపురం గ్రామ రైతు సంఘం, కౌలు రైతు సంఘం కమిటీలను ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా దేశిరెడ్డి సైదిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అన్నెం నరసింహారెడ్డి, కార్యదర్శిగా ఉల్లెందుల భాస్కర్, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణరెడ్డి, భిక్షారెడ్డి, కౌలు రైతు సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా అన్నెం ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తుపాకుల రామయ్య, కార్యదర్శిగా గంగిరెడ్డి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా కోటిరెడ్డి, అన్నెం వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

చిలుకూరు: సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ సెల్ కార్యదర్శి గంగిరెడ్డి నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయడంతో పాటు సాగునీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు

● పంట రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయడం రైతులకు వరంలాంటిదని చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్ అన్నారు. చిలుకూరులో నిర్వహించిన ఆ సంఘ పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. సంఘ పరిధిలో మొదటి విడతలో 1,069 మంది రైతులకు రూ.3.57 కోట్లు, రెండో విడతలో 207మంది రైతులకు రూ.1.85కోట్లు రుణ మాఫీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో చిలువేరు లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు కస్తూరి సైదులు, కొండా సోమయ్య, బెల్లంకొండ సైదులు, కొడారు రాంబాబు, శ్రీహరి, రాములు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు

తిరుమలగిరి: పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించే జాతీయ ఓబీసీ తొమ్మిదో మహాసభలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో పోస్టర్లు ఆవిష్కరించారు. దేశంలో కులాల వారీగా జనాభాను లెక్కించాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, కడెం లింగయ్య, దుస్సా రాంమూర్తి, అశోక్, ఉపేందర్, రాములు పాల్గొన్నారు.

● తిరుమలగిరిని స్వచ్ఛ మునిసిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలోని ఎనిమిది వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చెత్త కుండీలను పంపిణీ చేసి మాట్లాడారు.

నూతన్‌కల్: తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే సామేలుకు సమాచారం లేకుండా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం తగదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పాల్వాయి నాగరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మిర్యాల గ్రామానికి చెందిన కనకటి వెంకన్న గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై భౌతిక దాడులు చేయించడంతో పాటు, కేసులు పెట్టించాడన్నారు. అలాంటి వ్యక్తిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ఎమ్మెల్యేను అవమానించడమేనని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు చిత్తలూరి నారాయణ, వాసుదేవారెడ్డి, కార్తీక్, నాగయ్య, మధు, గణేష్, రాము, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: అంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మద్దిరాల మండల పరిధిలోని పోలుమళ్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు సమావేశంలో కోట గోపి, కందాళ శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, దండా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.